# పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శరత్, చిత్రంలో ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్లు

- పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు
- సంగారెడ్డి జిల్లా సరిహద్దుల్లో 9 చెక్‌పోస్టులు, 15 ఫ్లయింగ్ స్క్వాడ్లు
- ఇప్పటి వరకు రూ.1.61 కోట్లు సీజ్
- ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి
- ఊరూరా ఓటరు అవగాహన కార్యక్రమాలు
- సంగారెడ్డి ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్

సంగారెడ్డి, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. జిల్లాలో ఈవీఎం, వీవీప్యాడ్ల ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారుల సమక్షంలో ఈవీఎం, వీవీప్యాడ్ల ర్యాండమైజేషన్ చేపట్టినట్లు తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అదనపు ఎస్పీ అశోక్, డీఆర్డీవో నగేశ్‌తో కలిసి శుక్రవారం విలేకరులతో కలెక్టర్ శరత్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఎన్నికల నియమావళి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎవరైనా ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగదు రవాణా జరుగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

సంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు రూ.1.61 కోట్ల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. పోలీసుశాఖతోపాటు ఎన్నికల బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. కర్ణాటక సరిహద్దుల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సంగారెడ్డి జిల్లాలో గత ఎన్నికల సమయంలో ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే ప్రస్తుతం తొమ్మిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు 15 ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామని, ప్రతి నియోజకవర్గం లో 3 ఫ్లయింగ్ స్క్వాడ్లు పని చేస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు నిబంధలన మేరకు ఎన్నికల్లో ఖర్చు చేయాలని సూచించారు. అభ్యర్థుల ఖర్చును పరిశీలించడానికి జిల్లాస్థాయిలో కమిటీ వేసినట్లు వివరించారు. జిల్లాలోని ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 1594 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి శరత్ హెచ్చరించారు.

**ఎన్నికల కోసం పటిష్టమైన భద్రత**

అసెంబ్లీ ఎన్నికల కోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు రూ.1.61 కోట్లు సీజ్ చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు 180 కేసులు నమోదు చేశామని తెలిపారు. రూ.13.52 లక్షల విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటివరకు 1219 మందిని బైండోవర్ చేశామని, మరో 1000 మందిపై నిఘా వేశామని, వారిని త్వరలోనే బైండోవర్ చేస్తామని తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో 9 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ప్రలోభాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రూపేశ్ హెచ్చరించారు.



జహీరాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

# అభివృద్ధికి 'కాంగ్రెస్' అడ్డు

- ఎస్సీ నియోజకవర్గంలో స్థానిక నాయకుడికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎందుకు ఇవ్వ లేదు..?
- బీఆర్‌ఎస్‌లో ఎస్సీ నాయకులకు ప్రాధాన్యత
- కాంగ్రెస్, బీజేపీ నాయకులకు గుణపాఠం తప్పదు
- జహీరాబాద్‌లో మాణిక్‌రావు విజయం ఖాయం
- రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు

జహీరాబాద్, అక్టోబర్ 20 : కాంగ్రెస్ పార్టీలో దళితులకు ప్రాధాన్యత లేకపోవడంతో స్థానిక నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు తెలిపారు. శుక్రవారం జహీరాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవీప్రసాద్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శివకుమార్ మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గంలో దళితుల జనాభా ఎక్కువగా ఉండడంతో ఎస్సీ నియోజకవర్గంగా 2019లో ఏర్పాటు చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అప్పుడు కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉండగా, గజ్వేల్‌లో ఎమ్మెల్యేగా ఉన్న గీతారెడ్డిని జహీరాబాద్ ఎస్సీ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించారన్నారు. ఎస్సీ నియోజకవర్గంగా ఉంటే స్థానిక నేతలకు కాంగ్రెస్ పార్టీ ఎందుకు టికెట్ ఇవడం లేదని ప్రశ్నించారు. దళితులకు ప్రాధాన్యత లేకపోవడంతోనే ఝరాసంగం జడ్పీటీసీ వినీల నరేశ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారని తెలిపారు. సీఎం కేసీఆర్ స్థానిక నాయకుడికి టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకులకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌రావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం జహీరాబాద్ పట్టణాభివృద్ధికి గతంలో రూ. 35కోట్లు, సీఎం కేసీఆర్ రూ. 50 కోట్లు, ప్రస్తుతం రూ. 30కోట్లు మంజూరు చేశారన్నారు. బీఆర్‌ఎస్ అధి కారంలోకి వచ్చిన వెంటనే రూ.400లకు గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. ప్రతి ఇంటికీ ఆరోగ్య బీమా కల్పించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. కర్ణాటకలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని విమర్శించారు. కర్ణాటకలో కరెంట్ సమస్య పరిష్కరించలేని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రైతాంగానికి ఎలా న్యాయం చేస్తున్నదని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోల నరోత్తమ్, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, టెలికాం బోర్డు సభ్యుడు, బీఆర్‌ఎస్ జహీరాబాద్ నియోజకవర్గ గిరిజన తండాల ఇన్‌చార్జి పవార్ శంకర్‌నాయక్, ఇప్పెపల్లి పీఏసీఎస్ చైర్మన మచ్చేందర్, బీఆర్‌ఎస్ జహీరాబాద్, కోహీర్ మండలాల అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింహులు, నాయకులు మంజూల, అనుషమ్మ, మణ్యమ్మ ఉన్నారు.

# సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా

- ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ కమిషనర్ హరికిషన్



కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఎక్సైజ్ అధికారుల సమావేశం

జహీరాబాద్, అక్టోబర్ 20 : శాసనసభ ఎన్నికలు ముగిసే వరకు కర్ణాటక, తెలంగాణ ఎక్సైజ్ పోలీసులు సహకరించుకోవాలని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ కోరారు. శుక్రవారం జహీరాబాద్‌లో కర్ణాటక, తెలంగాణ ఎక్సైజ్‌శాఖ అధికారుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో 9 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నామన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర వైపు నుంచి మత్తు పదార్థాలు, మద్యం తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రఘురాం, డీపీఈవో గాయత్రి, బీదర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ పాటిల్, కలబుర్గా డిప్యూటీ కమిషనర్ సంజయ్‌కుమార్, డీఎస్పీలు అజయ్‌కుమార్, ఆనంద్, జహీరాబాద్ ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా

పాపన్నపేట, అక్టోబర్ 20 : మెదక్ జిల్లాలో 100 శాతం ఓటింగ్ లక్ష్యంతో అధికారులు పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా, ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. శుక్రవారం పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి, యూసుఫ్ పేట గ్రామాల్లో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటింగ్‌పై ప్రజలను చైతన్యవంతులు చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా ఆదేశించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలన్నారు. ప్రలోభాలకు గురికావద్దని, దేశాన్ని ప్రభావితం చేసే శక్తి ఓటుకే ఉన్నదన్నారు. ఈ నెల 31లోగా అర్హులందరూ ఓటరుగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో ఓటింగ్‌లో మెదక్ జిల్లా 3వ స్థానంలో ఉన్నదని, ప్రస్తుతం మొదటి స్థానంలో ఉండాలని కోరారు. నవంబర్ 10 నుంచి 25 వరకు ఓటరు గుర్తింపు పత్రాలు అందజేస్తామన్నారు. ఎవైనా సందేహాలు ఉంటే స్థానిక ఎన్నికల అధికారిని సంప్రదించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

**ఓటరు చైతన్యరథంతో ప్రచారం..**

మెదక్ జిల్లాలో వందశాతం ఓటింగ్ లక్ష్యంగా ఓటరు చైతన్యరథంతో ప్రచారం చేస్తున్నట్లు ఎస్పీ రోహిణిప్రియదర్శిని తెలిపారు. 'నేను కచ్చితంగా ఓటేస్తాను' అనే నినాదంతో ఓటింగ్‌లో భాగస్వామం కావాలన్నారు. ప్రధాన కూడళ్లు, మార్కెట్లు, కాలనీలు, తండాల్లో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదులను విజిల్ ఆప్‌లో నమోదు చేయాలని, కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 1950కి కాల్ చేయవచ్చని సూచించారు. సమావేశంలో డీఎస్పీ ఫణీందర్, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు పాల్గొన్నారు.


ర్యాలీగా వస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, యువకులు, కార్యకర్తలు

# విజయం మనదే

- మహిపాల్‌రెడ్డిని గెలిపిస్తాం
- జిన్నారం మండల యువజన సమావేశంలో కార్యకర్తల ప్రతిజ్ఞ

జిన్నారం, అక్టోబర్ 20 : పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి గూడెం మహిపాల్‌రెడ్డిని మూడోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తామని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతోపాటు యువకులు నినదించారు. మహిపాల్‌రెడ్డి విజయానికి పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. శుక్రవారం ఊట్ల గ్రామశివారులోని ఎన్ఆర్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో యువజన సమావేశం నిర్వహించారు. యువజన సమావేశానికి అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా రైస్‌మిల్ వరకు చేరుకున్నారు. అక్కడి నుంచి భారీ బైక్ ర్యాలీగా ఫంక్షన్ హాల్‌కు చేరారు. జై బీఆర్‌ఎస్.. జై కేసీఆర్.. జై జీఎంఆర్ నినాదాలతో ప్రాంగణం మారుమోగింది. సమావేశానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తనయుడు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు విక్రమ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గూడెం విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో యువతకు సముచితమైన స్థానం ఉంటుందన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి యువత తోడు కావడంతో మరింత బలం పెరిగిందన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకొని, కావాల్సిన అభివృద్ధిని చేసుకుందామన్నారు.

జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రభుత్వ నిధులే కాకుండా సీఎస్ఆర్, సొంత ఖర్చుతో అభివృద్ధి పనులు చేశారన్నారు. పటాన్‌చెరులో జరిగిన అభివృద్ధి జిల్లాలో ఎక్కడా జరగడం లేదు. మహిపాల్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశంగౌడ్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేయాలన్నారు. వావిలాల గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ నాయికోటి మురళి కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. యువజన సమావేశంతో యువకుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది.

సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజేశ్, సర్పంచ్‌లు ప్రకాశ్‌చారి, చెట్టి శివరాజ్, చిట్ల సత్యనారాయణ, ఆంజనేయులు, జనార్దన్, ఖదీర్, నాయకులు బేల కృష్ణ, నరేందర్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గద్దె నర్సింహ, ఆకుల నవీన్‌కుమార్, భీమ్‌రావు, మహేశ్, వరుణ్, శ్రీధర్‌గౌడ్, రాజ్‌కుమార్, రమేశ్, గణేశ్ పాల్గొన్నారు.


యువజన సమావేశంలో మాట్లాడుతున్న గూడెం విక్రమ్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**KIDNEY STONES**

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం. 47 సం||, అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. Ph: 9866007924, 9550336677, 040-27000580.
NT-320707

**WANTED**

★ రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.